సాక్షి
కామారెడ్డి

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 80 ఫిర్యాదులు నమోదయ్యాయి. కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు.

- 8లో ▸



ఘనంగా వసంత పంచమి

జిల్లాలో సోమవారం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. ఆలయాలు, పాఠశాలల్లో అక్షరాభ్యాసాలు చేయించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /14.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కామారెడ్డి సబ్ జైలును సందర్శించిన డీజీ



కామారెడ్డి క్రైం : కామారెడ్డి సబ్ జైలును జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా సోమవారం సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి భోజనం, వసతులపై ఆరా తీశారు. న్యాయ సేవలు, ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, ఎస్పీ సింధు శర్మ, ఏఎస్పీ చైతన్యరెడ్డి, సబ్‌జైల్ సూపరింటెండెంట్లు ఆనందరావు, సంజీవరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా రాజేందర్‌రెడ్డి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా రాజేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ అడిషనల్ కమిషనర్‌గా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆయన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎఫ్ఏసీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన స్పందన రంగారెడ్డి మెప్మా పీడీగా తనస్థానానికి వెళ్లారు. డిసెంబర్ 19న మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన స్పందన నెలన్నర రోజులు మాత్రమే ఇక్కడ పని చేశారు.

జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



కామారెడ్డి అర్బన్ : కేరళలోని త్రిసూర్‌లో గతనెల 31 నుంచి ఈనెల 3 వరకు నిర్వహించిన సీనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు సత్తా చాటాడు. సునీల్‌రెడ్డి 800 మీటర్లు, 5 వేల మీటర్ల పరుగు పందెంలలో వెండి పతకాలు సాధించాడని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజిత్‌మోహన్, నరేష్ తెలిపారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపిక



దోమకొండ : అంతర్జాతీయ కుమితే కరాటే పోటీలకు సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన వడ్ల భానుహర్ష ఎంపికయ్యాడు. తమిళనాడులో ఆదివారం జరిగిన యూజీకేఎఫ్ఐ కుమితే కరాటే చాంపియన్‌షిప్‌లో అండర్–14 (38 కిలోలు) విభాగంలో భానుహర్ష బంగారు పతకం సాధించడంతో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారని కోచ్ కామిండ్ల రాజయ్య తెలిపారు. త్వరలో శ్రీలంకలో నిర్వహించే అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటాడని పేర్కొన్నారు. భానుహర్షను గ్రామస్తులు అభినందించారు.

రాకాసి రాచపుండు

- చాపకింద నీరులా విస్తరిస్తున్న వ్యాధి
- క్యాన్సర్ బారిన పడుతున్న వందలాది మంది

నేడు వరల్డ్ క్యాన్సర్ డే

రాకాసి రాచపుండు పల్లె, పట్నం తేడా లేకుండా అంతటా విస్తరిస్తోంది. ఎన్నో జీవితాలను బలితీసుకుంటోంది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో ప్రస్తుతం 415 మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారు. చాపకింద నీరులా విస్తరిస్తోన్న ఈ వ్యాధి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.



క్యాన్సర్ బాధితురాలితో మాట్లాడుతున్న పాలియేటివ్ కేర్ సెంటర్ వైద్యులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో క్యాన్సర్ వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. జిల్లావైద్య ఆరోగ్య శాఖ వద్ద నమోదైన వివరాల ప్రకారం ప్రస్తుతం జిల్లాలో 415 మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారు. అయితే ప్రైవేటులో వైద్యం చేయించుకుంటున్న వారి సంఖ్య అంతకు రెట్టింపు ఉంటుందని భావిస్తున్నారు. ప్రధానంగా మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారు. నోటి క్యాన్సర్, లివర్, బ్లడ్, బోన్ క్యాన్సర్ కూడా చాలా మందిలో బయటపడుతోంది. సిగరెట్టు, గుట్కా వంటివాటికి ఎక్కువగా మగవాళ్లు అలవాటు పడుతున్నారు. వాటి ద్వారా రకరకాల క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయి. సరైన వ్యాయామం లేకపోవడం, కొవ్వు అధికంగా ఉన్న మాంసాహార పదార్థాలు, జంక్ ఫుడ్ తీసుకోవడం ద్వారా కూడా వ్యాధుల బారిన పడుతున్నారు. పురుషుల్లో ప్రధానంగా నోరు, గొంతు, జీర్ణాశయం, ఊపిరితిత్తులు, అన్నవాహిక, కాలేయం వంటి క్యాన్సర్లు సోకుతున్నాయి. మహిళలు గర్భాశయ ముఖద్వారా, రొమ్ము, గొంతు, నోటి క్యాన్సర్ల బారినడపతున్నారు.

జిల్లాలో పీహెచ్‌సీలవారీగా క్యాన్సర్ బాధితుల వివరాలు

పీహెచ్‌సీ	బాధితులు	దేవునిపల్లి	30	బీర్కూర్	10	మిషన్ కల్లాలి	08
నిజాంసాగర్	69	భిక్కనూరు	24	అన్నారం	10	పుల్కల్	06
బీబీపేట	36	జుక్కల్	24	ఉత్తునూరు	10	ఫత్లాపూర్	06
ఎర్రాపహాడ్	35	మత్మల్	21	రామారెడ్డి	10	సదాశివనగర్	06
మాచారెడ్డి	31	నాగిరెడ్డిపేట్	14	లింగంపేట్	09	తాడ్కోల్	03
రాజంపేట	30	రామారెడ్డి	11	డోంగ్లీ	09	పెద్దకొడప్‌గల్	03

మహిళలే అధికం..

కామారెడ్డి ప్రాంతానికి చెందిన వారు వ్యాధి నిర్ధారణ, వైద్యం కోసం హైదరాబాద్, కరీంనగర్ తదితర పట్టణాలకు వెళుతున్నారు. జిల్లా కేంద్రంలో కీమోథెరపీ వైద్యం అందిస్తున్నారు. అలాగే వ్యాధి తీవ్రత పెరిగిపోయి ఇబ్బందుల్లో ఉన్న వారికి పాలియేటివ్ కేర్ సెంటర్‌లో చికిత్సలు అందిస్తున్నారు. కాగా క్యాన్సర్ వ్యాధి బారినపడే వారిలో మహిళలే అధికంగా ఉంటున్నారు. అందులో సగం మంది రొమ్ము క్యాన్సర్ బాధితులేనని తెలుస్తోంది. రొమ్ము క్యాన్సర్‌తో పాటు బోన్ క్యాన్సర్, బ్లడ్‌క్యాన్సర్ బారిన కూడా చాలా మంది పడుతున్నారు. రొమ్ము, నోటి క్యాన్సర్లతో చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గుర్తించలేకపోవడంతో ప్రాణాలమీదికి..

చాలా మందిలో క్యాన్సర్ చివరి దశలోనే గుర్తిస్తున్నారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్టు తొలి దశలో గుర్తించి చికిత్సలు పొందుతున్నవారు వ్యాధిని జయిస్తున్నారు. ఇలా గుర్తించలేనివారికి ఆఖరు స్టేజీలో బయటపడుతోంది. అప్పటికే వ్యాధి ముదిరిపోవడంతో ఏ చికిత్సా ఫలితమివ్వక కొద్ది రోజుల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారు. చాపకింద నీరులా విస్తరిస్తున్న ఈ వ్యాధి తీవ్రత ఆందోళన కలిగిస్తోంది.

పదేళ్లలో ఐదు వేల మందికిపైగా...

జిల్లాల్లో పదేళ్లలో ఐదు వేల మందికిపైగా క్యాన్సర్ వ్యాధి బారిన పడినట్టు తెలుస్తోంది. వ్యాధి తీవ్రత పెరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. కొందరు వివిధ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీ సెంటర్లకు వెళ్లి పేర్లు నమోదు చేసుకుంటున్న వారు కొందరు ఉండగా, చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. దీంతో వారి సంఖ్య వెల్లడి కావడం లేదు. జిల్లా అంతటా వ్యాధి బాధితులు కనబడుతున్నారు. క్యాన్సర్ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వ్యాధి సోకిన వారికి అవసరమైన వైద్యాన్ని అందించేందుకు మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో 237 ఎంపీటీసీ స్థానాలు

- 25 జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాలు..
- ఖరారు చేసిన అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాల లెక్క తేలింది. గతంలో జిల్లాలో 22 మండలాలు ఉండేవి. కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేశారు. దీంతో జిల్లాలో మండలాల సంఖ్య 25కు చేరింది. దీనికి అనుగుణంగా జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల సంఖ్య 25 అయ్యింది. అలాగే మండల పరిషత్ ప్రాదేశిక స్థానాలు (ఎంపీటీసీ) 236 ఉండేవి. ప్రస్తుతం ఒక స్థానం పెరగడంతో జిల్లాలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 237 కు చేరింది.

నిజాంసాగర్‌లో తగ్గిన స్థానం..

నిజాంసాగర్ మండలంలో గతంలో 11 ఎంపీటీసీ స్థానాలుండేవి. కొత్తగా మహ్మద్‌నగర్ మండలం ఏర్పాటు చేయడంతో రెండు మండలాల్లో జనాభాకు అనుగుణంగా 5 చొప్పున ఎంపీటీసీ స్థానాలను సర్దుబాటు చేశారు. సర్దుబాటులో డిక్కడ ఒక స్థానం తగ్గింది.

బీబీపేట మండలంలో దోమకొండ మండలంనుంచి సేరిబీబీపేట గ్రామం కలవడంతో ఒక ఎంపీటీసీ స్థానం పెరిగింది. పెద్దకొడప్‌గల్ మండలంలోకి సంగారెడ్డి జిల్లా నుంచి కలిసిన బాబుల్‌గావ్ గ్రామం చేరడంతో ఇక్కడా ఒక స్థానం పెరిగింది.

19 అభ్యంతరాలు..

ఎంపీటీసీ స్థానాల మార్పులు, చేర్పులపై జిల్లాలో 19 అభ్యంతరాలు వచ్చాయి. దీన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. పాల్వంచ మండలంలోని భవానీపేట తండా పంచాయతీని ఇటీవల భవానీపేట ఎంపీటీసీ స్థానంలో కలపగా స్థానికులు అభ్యంతరం తెలిపారు. దీన్ని పరిశీలించిన కలెక్టర్ గతంలోలాగే ఆరెపల్లి ఎంపీటీసీ స్థానంలో కొనసాగించాలని నిర్ణయించారు. మిగతా 18 అభ్యంతరాలను తిరస్కరించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కామారెడ్డి క్రైం: రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నియమావళిని పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలో 54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో పట్టభద్రులకోసం 29 కేంద్రాలు, ఉపాధ్యాయులకోసం 25 కేంద్రాలు ఉన్నాయన్నారు. 13 కామన్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు పట్టభద్రుల ఓట్లు 16,417, ఉపాధ్యాయుల ఓట్లు 2,125 ఉన్నాయని వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ భవనాలను రాజకీయ పార్టీల వ్యవహారాలకు వినియోగించవద్దని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఎన్నికల విభాగం తహసీల్దార్ సరళ, డీటీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సంగ్వాన్ ఆదేశించారు. సోమవారం ఆయన కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి, ఎన్నికల రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల గదులను పరిశీలించారు. సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ జనార్దన్, ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్ ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నీలం చిన్నరాజులు



నీలం చిన్నరాజులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్ : జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నీలం చిన్నరాజులు ఎన్నికయ్యారు. సోమవారం పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. 2008లో పార్టీ దేవునిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా పని చేసిన ఆయన ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గతంలో ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌లలో పనిచేసిన ఆయన.. బీజేపీ జిల్లా, రాష్ట్ర స్థాయి పదవుల్లో కొనసాగి అందరి మన్ననలు పొందారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ చిన్న రాజులను సన్మానించి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర కమిటీ సభ్యుల నియామకం

బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా విపుల్ జైన్(కామారెడ్డి), గొనె గంగారాం(జుక్కల్), దుర్కి పోశెట్టి(బాన్సువాడ), మర్రి బాలకిషన్(ఎల్లారెడ్డి)లను నియమించారు. ఈ విషయమై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోమవారం ప్రకటన విడుదల చేశారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు
- జిల్లాకేంద్రంలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం



జిల్లా కేంద్రంలో ప్రధాని దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్‌లో ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపించారన్నారు. తెలంగాణకు నిధులు తేవడంతో బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు విఫలమయ్యారన్నారు. వారంతా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, షేరు, రాజాగౌడ్, సిరాజుద్దీన్, పుట్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- ఆసక్తి చూపుతున్న రైతులు
- జిల్లాలో 800 ఎకరాల్లో సాగు



లింగంపేట సంతలో కూరగాయలు విక్రయిస్తున్న రైతు(ఫైల్)

లింగంపేట : వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకునేందుకు పలువురు రైతులు కూరగాయల సాగు వైపు మళ్లుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 800 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలు సాగవుతున్నాయి. తాడ్వాయి, లింగంపేట, గాంధారి, సదాశివనగర్, ఎల్లారెడ్డి, రాజంపేట మండలాల్లో ఎక్కువగా కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. లింగంపేట మండలంలో 50 మంది రైతులు కూరగాయలు పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. పలువురు రైతులు కూరగాయల సాగుతో నెలకు రూ. 25 వేల వరకు సంపాదిస్తున్నారు. టమాట, వంకాయ, బెండకాయ, పచ్చిమిర్చి, గోరు చిక్కుడు, పాలకూర, తోటకూర, గోంగూర, మెంతి, గంగవాయిలి కూర, కొత్తిమీర, పుదీన తదితర పంటలు పండిస్తున్నారు.

పందిరి సాగు విధానం..

పందిరి సాగు విధానంతో మంచి దిగుబడులు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ విధానంలో తీగజాతికి చెందిన బీరకాయ, కాకర కాయ, సొరకాయ, పొట్లకాయ, చిక్కుడు, దొండకాయ తదితర పంటలు సాగు చేస్తున్నారు. పందిరి సాగుతో మొక్కలు ఏపుగా పెరిగి తీగలు పందిరిపై అల్లుకొని కాయలు కిందికి వేలాడుతాయి. దీంతో కాయ చెడిపోకుండా ఉంటుంది. కోయడానికి కూడా ఇబ్బందులు ఉండవు. దీంతో రైతులు ఎక్కువగా పందిరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. తీగజాతికి చెందిన కూరగాయలు సుమారు 60 రోజుల నుంచి కోతకు వస్తాయి. మూడు, నాలుగు రోజులకోసారి కూరగాయలు కోస్తామని రైతులు తెలిపారు. వాటిని కామారెడ్డి బీట్‌తోపాటు గ్రామాలు, మండల కేంద్రాల్లోని వారాంతపు సంతల్లో విక్రయిస్తామని పేర్కొన్నారు.

15 ఏళ్లుగా సాగు చేస్తున్నా



15 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాను. గతేడాది 30 గుంటలలో పచ్చిమిర్చి పండించి రూ. 2 లక్షల వరకు సంపాదించాను. డ్రిప్ పరికరాలు, మల్చింగ్ కవర్, ట్రిల్లిస్ పరికరాల ధరలు ఎక్కువగా ఉండడంతో పెద్దగా లాభం ఉండడం లేదు. ప్రభుత్వం ఆయా పరికరాలను సబ్సిడీపై అందిస్తే బాగుంటుంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే కూరగాయల సాగు విస్తీర్ణమూ పెరుగుతుంది. – బాలపోచయ్య, పర్మళ్ల

నెలకు రూ. 25 వేల ఆదాయం..



అర ఎకరంలో కాకర, బీర, పొట్లకాయ పంటలు సాగు చేస్తున్నాను. పందిరి కింది భాగంలో టమాట వేస్తున్నాను. విత్తనం నాటిన నుంచి 60 రోజుల్లో పంటలు కోతకు వస్తాయి. 120 రోజుల వరకు పంట వస్తుంది. ఖర్చులు పోను నెలకు సరాసరిన రూ. 25 వేల వరకు ఆదాయం వస్తోంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తా. – గుర్రపు సంతోష్, రైతు, శెట్పల్లిసంగారెడ్డి

రాళ్లల్లో రైతుభరోసా సాగు..

- క్షేత్రస్థాయిలో సర్వే చేయని అధికారులు
- అర్హుల జాబితాలో అనర్హుల పేర్లు

బిచ్కుంద: సర్కారు సొమ్ము రాళ్ల పాలవుతోంది. సంక్షేమ ఫలాలు అనర్హులకూ అందుతున్నాయి. అధికారులు నామమాత్రంగా సర్వే నిర్వహించడంతో సాగు యోగ్యం కాని భూములూ రైతుభరోసా అర్హుల జాబితాలో చేరాయి. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం రైతులందరికీ రైతుబంధు పేరిట పెట్టుబడి సాయం అందించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం నిధులు దుర్వినియోగం కావద్దనే ఉద్దేశంతో సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించి, సర్వే నిర్వహించింది. ఈ సర్వే నామమాత్రంగా జరిగిందన్న విమర్శలున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో సాగుకు యోగ్యం కాని గుట్టలు, రాళ్లు, మొరం ఉన్న భూములను సైతం రైతు భరోసాకు ఎంపిక చేశారు. బిచ్కుంద శివారులో 814 సర్వే నంబరులో 317 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉంది. అధికారులు అప్పట్లో గుట్టలకే ఇష్టారీతిన పట్టాలు ఇచ్చారు. ఇందులో సుమారు 55 ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా ఉందంటూ అధికారులు ఆ భూముల యజమానుల పేర్లు రైతు భరోసా అర్హుల జాబితాలో చేర్చారు. అయితే అందులో కనీసం పది ఎకరాలు కూడా సాగుకు యోగ్యంగా లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. సాగుకు పనికిరాని భూములను తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపించి అనర్హులను రైతు భరోసా జాబితాలోంచి తొలగించాలని కోరుతున్నారు.

సర్వే చేయిస్తాం

బిచ్కుంద శివారులోని 814 సర్వే నంబరులో గుట్టలు ఉన్న విషయం వాస్తవమే. ఇందులో సాగుకు యోగ్యంగా లేని భూములను గుర్తించడానికి రెండోసారి సర్వే చేయాలని అధికారులను ఆదేశించాం. అర్హులకే రైతు భరోసా అందేలా చర్యలు తీసుకుంటాం. – సురేశ్, తహసీల్దార్, బిచ్కుంద



బిచ్కుందలో సాగుకు యోగ్యమైనదిగా గుర్తించిన భూమి

కల్యాణలక్ష్మి డబ్బులు స్వాహా



బాన్సువాడ: తన కూతురు పేరుతో మంజూరైన కల్యాణలక్ష్మి డబ్బులు స్వాహా అయినట్లు బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన పవార్ సాంబయ్య సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన కూతురు వివాహం గతేడాది డిసెంబర్ 12న జరిగిందని, కల్యాణలక్ష్మి ఆర్థికసాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి వెళ్లగా అప్పటికే చెక్కు మంజూరైనట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన కూతురు పేరుపై తప్పుడు పత్రాలు సృష్టించి కల్యాణలక్ష్మి డబ్బులను తహసీల్ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేసిన గణేశ్ తన భార్య అకౌంట్‌లో వేసుకున్నట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించిన వారితోపాటు ఇందులో ప్రమేయం ఉన్న వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయంగా తమకు రావాల్సిన కల్యాణలక్ష్మి సాయాన్ని ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

మత్స్యకారులు సీఎస్‌ఎస్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి


కామారెడ్డి అర్బన్: జిల్లాలో మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వం పొందిన మత్స్యకారులందరూ ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి యోజనలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యత్వం ఉన్న మత్స్యకారులు సీఎస్‌ఎస్ సెంటర్లలో ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ ఫోన్, బ్యాంకు ఖాతా పుస్తకంతో వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలుంటే ఆయా మండలాల మత్స్యశాఖ ఇన్‌చార్జిలను సంప్రదించాలన్నారు.

సిద్ధరామేశ్వరాలయంలో మైనంపల్లి పూజలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరాలయాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయం అభివృద్ధికి సహాయ సహకారాలను అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

పోషకాహార లోపాన్ని గుర్తించాలి



మాచారెడ్డి: వీవోఏలు పిల్లలలో ఏర్పడిన పోషకాహార లోపాన్ని ఎప్పటికప్పుడు గుర్తించాలని అదనపు డీఆర్డీవో మురళీ కృష్ణ సూచించారు. సోమవారం మండల సమాఖ్య పరిధిలో పిల్లల్లో పోషణ లోపం, నివారణ అంశాలపై వీవోఏలు, సీసీలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఐదేళ్ల లోపు పిల్లల్లో పోషకాహార లోపం పెరుగుతోందన్నారు. పోషణ లోపాన్ని సాధారణ ఆరోగ్య పోషకాహార పద్ధతులను అనుసరించి పరిష్కరించవచ్చన్నారు. డీపీఎం రమేశ్ బాబు, ఏపీఎం శ్రీనివాస్, సీసీ సాయిలు ఉన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 80 వినతులు




ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 80 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వినతులను పెండింగ్‌లో పెట్టవద్దని సూచించారు.

నోడల్ అధికారుల నియామకం..

ప్రజావాణి అనంతరం ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ప్రకటించిన శాసన మండలి సభ్యుల ఎన్నికల నిర్వహణకు జిల్లాలో నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం కోసం ఉద్యోగుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ప్రచార సామగ్రి, రాజకీయ నాయకుల ఫొటోలు కలిగిన పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. త్వరలో ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపారు. ఆర్డీవో మన్నె ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిర్మాణాలు నిలిపేయాలని వినతి



ఫిర్యాదు చేస్తున్న మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్

దోమకొండ: మండల పరిషత్ కార్యాలయ భవన ప్రహరీ లోపల చేపడుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపేయాలని మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ కోరారు. ప్రహరీ లోపల భాగంలో షట్టర్‌ల నిర్మాణం వల్ల కార్యాలయానికి వచ్చే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆయన పేర్కొన్నారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహీముద్దీన్ అన్నారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ. ఏవో నర్సింలు, ఎంపీవో సవితారెడ్డి, ఎంఈవో రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించాలి

రాజంపేట: ఎమ్మెల్సీ ఎన్నిక ఉన్నందున గ్రామాలలో వివిధ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం రాజంపేట తహసీల్ కార్యాలయంలో వీసీ ద్వారా ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను వసతి సౌకర్యాలను పరిశీలించమని తహసీల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. ఏవో శృతి, ఎంపీడీవో రఘురాం, మిషన్ భగీరథ ఏఈ రజిత, డీఆర్డీఏ ఏపీఎం సాయిల్, ఐసీడీఎస్ సూపర్వైజర్ హైమావతి, డీఆర్డీఏ ఏపీవో సక్కుబాయి, ఎక్సైజ్ కానిస్టేబుల్ శరత్ కుమార్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో పాల్గొన్న మండల అధికారులు

ప్రాణాలతో చెలగాటమా..!



హాస్టల్ భవనంపై ప్రమాదకరంగా ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కామారెడ్డి టౌన్: పైన కనిపిస్తున్న చిత్రంలో విద్యార్థులు భవనం చివరి అంతస్తుపై నిలబడి ప్రమాదకరంగా పనులు చేస్తున్నారు. భవనం మూడో అంతస్తుపై గోడ అంచున నిలబడి విద్యార్థులు పనులు చేస్తుంటే చూసిన వారంతా భయాందోళనకు గురయ్యారు. గోడ అంచున బకెట్‌లో నీళ్లు మోస్తున్న ఆ విద్యార్థి ఒక్కసారి కాలు జారిపడిపోతే ఎంత ప్రమాదమో ఊహించుకుంటేనే గుండె జారిపోతుంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం పక్కనే ఉన్న ప్రభుత్వ ఎస్టీ బాలుర హాస్టల్ మూడో అంతస్తుపై ఉన్న వాటర్ ట్యాంక్‌ను సోమవారం శుభ్రం చేస్తూ సాక్షి కెమెరాకు చిక్కారు. హాస్టల్ అటెండర్ వాటర్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా విద్యార్థులతో కూడా ప్రమాదకర పరిస్థితిలో పనులు చేయించారు. విద్యార్థులతో పనులు చేయించవద్దని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా వార్డెన్ల తీరు మారడం లేదు.

అనకాపల్లి బెల్లం మార్కెట్ పరిశీలన



పరిశీలిస్తున్న భిక్కనూరు ఏఎంసీ పాలకవర్గం

భిక్కనూరు: ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి బెల్లం మార్కెట్‌ను భిక్కనూరు ఏఎంసీ పాలకవర్గం సభ్యులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, వైస్ చైర్మన్ స్వామిలు మాట్లాడుతూ.. తెలంగాణలో కామారెడ్డి ప్రాంతం భిక్కనూరు మార్కెట్ కమిటీ ప్రాంతంలో బెల్లం తయారీ రంగంలో అగ్రగామిగా ఉండేదని, కేసీఆర్ తప్పుడు విధానాల వల్ల బెల్లం తయారీ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. తిరిగి బెల్లం తయారీ కోసం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామన్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి నర్సింలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నమ్మండి.. ఇది కూడా ప్యాచేనండీ..!

- ప్రధాన రహదారులపై అడుగడుగునా నిర్లక్ష్యం



పద్మాజీవాడి క్రాస్ రోడ్డు నుంచి గాంధారి వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై వేసిన ఓ ప్యాచ్

కామారెడ్డి క్రైం: నిత్యం రోడ్డు భద్రత గురించి ప్రసంగాలు చేసే అధికారులు కళ్లెదుట కనిపిస్తున్న సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారులపై అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. అందుకు ఇక్కడ కనిపిస్తున్న ఫొటోలే నిదర్శనం. పద్మాజీవాడి క్రాస్ రోడ్డు నుంచి గాంధారి వెళ్లే దారిలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. చాలా రోజులకు కనికరించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఇటీవల ప్యాచ్ వర్క్ చేయించారు. తూతూ మంత్రంగా గుంతలు పూడ్చడంతో ఈ ప్రాంతంలో తిరిగే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. గాంధారి నుంచి వచ్చే వాహనాలు పద్మాజీవాడి క్రాస్ రోడ్డు వద్ద కామారెడ్డి వైపునకు వెళ్లే జాతీయ రహదారిపై బ్రిడ్జి కింద నుంచి టర్న్ తీసుకున్నాక రోడ్డంతా ఇసుకమయంగా మారింది. వాహనాలు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం రోడ్డు శుభ్రం చేయించే దిక్కు లేదని వాహనదారులు వాపోతున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని టేక్రియాల్ బైపాస్ వద్ద నూతనంగా ఫ్లైవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. వాహనాల రాకపోకలకు ఉపయోగిస్తున్న సర్వీస్ రోడ్డు గత వానాకాలంలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు సగానికి పైగా కొట్టుకుపోయింది. ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి మిగిలిన సగం రోడ్డు గుండానే వాహనాలు పంపుతున్నారు. కొట్టుకుపోయిన రోడ్డుకు మరమ్మతులు చేయించినా ఇప్పటికీ ప్రారంభించడం లేదు. పనులు అసంపూర్తిగా ఉండటంతో ఇక్కడ నుండి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా యంత్రాంగం ప్రధాన రహదారుల వెంబడి నెలకొన్న సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెడితే బాగుంటుందని వాహనదారులు అంటున్నారు.

చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలి

- పతంజలి విశ్వవిద్యాలయం డీన్ స్వామి పరమార్థదేవ్

లింగంపేట(ఎల్లారెడ్డి): చారిత్రక కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పతంజలి విశ్వవిద్యాలయం డీన్ స్వామి పరమార్థదేవ్ అన్నారు. సోమవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని చారిత్రక కట్టడం నాగన్నగారి మెట్ల బావిని సందర్శించి మాట్లాడారు. చారిత్రక కట్టడాలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు గుర్తులుగా నిలుస్తాయన్నారు. యోగా గురువులు రాంరెడ్డి, గ్రామస్తులు శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.




లింగంపేట నాగన్నగారి బావి వద్ద పరమార్థదేవ్

'మన పెరటి మొక్కలతోనే మన ఆరోగ్యం'

కామారెడ్డి అర్బన్: ఆయుర్వేదం మన జీవన విధానమని, పెరటి మొక్కలు తిప్పతీగ, కలబంద, తులసి, పారిజాతం, మునగ మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని స్వామి పరమార్థదేవ్ అన్నారు. భారత్ స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగా సమితి జిల్లా శాఖల ఆధ్వర్యంలో శని, ఆది, సోమ వారాల్లో నిర్వహించిన మూడు రోజుల మెగా యోగా శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్‌స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగా సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీధర్‌రావు, నందనం కృపాకర్, శివకుమార్, గడ్డం యోగా రాంరెడ్డి, పెట్టుగాడి అంజయ్య, రఘుకుమార్, బి.అనిల్‌కుమార్, సురేందర్, ఎల్లయ్య, ఎ.రమేష్, అంజయ్యగుప్తా, అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో కామారెడ్డి రక్తదాతలకు చోటు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో చోటు దక్కించుకుంది. తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం ఏడాది కాలంలో 22 మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి 2,306 యూనిట్ల రక్తం సేకరించినందుకు ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పంపిన పుస్తకం, ధ్రువపత్రాన్ని కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు ఎన్.బాలు, అధ్యక్షుడు వేదప్రకాష్, ప్రతినిధులు జమీల్ హైమద్, గంప ప్రసాద్ సోమవారం ప్రదర్శించారు.

అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృత్యువాత



బాన్సువాడ: బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన లింగం అనే వ్యక్తి కోళ్ల ఫారంలో అంతు చిక్కని వాధితో కోళ్లు మృత్యువాత పడ్డాయి. సుమారు 2,500 కోళ్లు చనిపోవడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. అంతు చిక్కని వ్యాధి వల్ల సుమారు రూ.4.5 లక్షలు నష్టపోయాడు. కోళ్ల వ్యాధి సోకి నియోజకవర్గంలో చికెన్ వినియోగదారులు తగ్గతున్నారని, ఈ కారణంగా వ్యాపారం దెబ్బతింటుందని లింగం వాపోయారు. ప్రభుత్వం కోళ్లకు వచ్చే వ్యాధిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టాని కోరుతున్నారు.

క్రైం కార్నర్

సీజ్ చేసిన ఇసుక వేలం

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని మారంపల్లిలో ఇటీవల సీజ్ చేసిన ఇసుకను తహసీల్దార్ నరేశ్ సమక్షంలో సోమవారం వేలం వేశారు. మొత్తం 16 ట్రాక్టర్ల ఇసుక ఉండగా నలుగురు వ్యక్తులు వేలంలో పాల్గొన్నారు. ట్రాక్టర్‌కు రూ.1,210 చొప్పున పాటపాడి మారంపల్లికి చెందిన కాశపురం రవి ఇసుక డంప్‌ను దక్కించుకున్నారు. ఇసుక పట్టుబడిన రోజున అది తనదేని ముందుకు వచ్చిన వ్యక్తి వేలంలో ఇసుకను దక్కించుకున్న వ్యక్తి ఒక్కరే కావడం గమనార్హం. అతడి వద్ద ఆధారాలు లేకపోవడంతో అధికారులు ఇసుకను వేలం వేయాల్సి వచ్చింది. వేలం ద్వారా సమకూరిన డబ్బును ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



రాజంపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. లేత మామిడి తండా నుంచి ఇతర గ్రామాలకు ఇసుక సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం తెల్లవారుజామున దాడి చేసి ఇసుక తరలిస్తున్న నడిమితండాకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. ఇసుక ట్రాక్టర్‌ను చాకచక్యంగా పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుళ్లు సురేశ్, చరణ్‌ను ఎస్సై అభినందించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మారుతినగర్ కాలనీలో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య సోమవారం తెలిపారు. ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతినగర్‌లో దాడి చేసి వ్యభిచార గృహం నిర్వాహకురాలితోపాటు ముగ్గురు బాధిత మహిళలు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రూ.3,660 నగదుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం రూరల్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

కోడి పందాల స్థావరంపై..

నవీపేట: మండలంలోని నాడాపూర్, కమలాపూర్ గ్రామాల మధ్య రహస్యంగా కొనసాగుతున్న కోడి పందాల స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. ఆరుగురిని అరెస్టు చేశామని, రెండు కోడి పుంజులతోపాటు రూ.4,600 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇద్దరి బైండోవర్

భిక్కనూరు: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తప్పుడు ప్రచారం చేస్తున్న తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఈనెల 1న పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించి సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన ఇల్లందుల ప్రభాకర్, ఇల్లందుల నరేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు. వారిద్దరిని తహసీల్దార్ శివప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్నూకర్ సెంటర్‌ల తనిఖీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న స్నూకర్ సెంటర్‌లను ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. అనుమతి లేని స్నూకర్ సెంటర్ల నిర్వాహకులతో మాట్లాడారు. స్నూకర్ సెంటర్‌లలో బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌హెచ్‌వో హెచ్చరించారు.

వేర్వేరు చోట్ల ఆరుగురి మృతి

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఆరుగురు వివిధ కారణాలతో మృతి చెందారు. చెరువులో పడి ఒకరు, కాలువలో పడి మరొకరు, అనారోగ్యంతో ఇద్దరు, రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు.


వర్ని (మోస్రా): మోస్రా మండలం గోవూరుకు చెందిన దండు చిన్న పోశెట్టి (77) అనే వ్యక్తి మోస్రా చెరువులో పడి మృతి చెందినట్లు వర్ని ఎస్సై రమేశ్ సోమవారం తెలిపారు. పోశెట్టికి మతిస్థిమితం సరిగా లేదని సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరద కాలువలో పడి..

వేల్పూర్: మండలంలోని పోచంపల్లి గ్రామం వద్ద శ్రీరాంసాగర్ వరదకాలువలో ప్రమాదవశాత్తు పడి రాజు(45) అనే వ్యక్తి మరణించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన రాజు భార్య సంగీతతో కలిసి సుమారు ఆరేళ్లుగా అంక్సాపూర్ గ్రామంలో ఉంటూ కూలీగా పని చేస్తున్నాడు. భార్య ఇటీవల కొమురవెల్లి జాతరకు వెళ్లగా ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. పోచంపల్లి గ్రామస్తులు వరదకాలువ వైపు వెళ్లగా రాజు మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రాజు భార్య సంగీత ఘటనాస్థలానికి చేరుకొని తీవ్రంగా రోదించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దోమకొండ వాసి..

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన అన్నం లక్ష్మీనారాయణగౌడ్(59) సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన లక్ష్మీనారాయణగౌడ్ కారులో శ్రీశైలం దైవదర్శనానికి వెళ్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన ఆయన మృతి చెందగా, గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.



లక్ష్మీనారాయణగౌడ్ (ఫైల్)

పరిస్థితి విషమించి గుర్తుతెలియని వృద్ధురాలు..

ఇందల్వాయి: మూడు రోజుల క్రితం ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వృద్ధురాలిని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయాలపాలైన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. మృతురాలి వయసు సుమారు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 59854 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.



వృద్ధురాలి మృతదేహం

అనారోగ్యంతో రిటైర్డ్ టీచర్..

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మహ్మద్ అహ్మద్ పాషా ((80) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. పాషా ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేశారు. ఇంగ్లిష్ బోధనలో ఆయనకు ఎవరూ సాటిరారని స్థానికులు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ గత కొంలంగా హైదరాబాద్‌లో ఉంటున్న పాషా మృతి చెందగా సోమవారం రాత్రి అంత్యక్రియలను అక్కడే నిర్వహించారు. మండలానికి చెందిన పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాషా వద్ద ఇంగ్లిష్ నేర్చుకున్న శిష్యులు అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.



అహ్మద్ పాషా(ఫైల్)

సౌదీలో చంద్రాయాన్‌పల్లికి చెందిన వ్యక్తి..

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయాన్‌పల్లి గ్రామ పరిధిలోని గోల్యా నాయక్ తండాకి చెందిన మోహన్‌నాయక్(43) అనే వ్యక్తి ఆదివారం రాత్రి సౌదీలో మృతి చెందాడు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అనారోగ్యానికి గురైన మోహన్ నాయక్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. 12 ఏళ్లుగా సౌదీలో ఉంటున్నాడని, అతడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారన్నారు. మృతదేహాన్ని త్వరగా గ్రామానికి రప్పించాలని మృతుడి బంధువులు కోరుతున్నారు.

మద్యానికి బానిసై వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య


రుద్రూర్/నందిపేట్: మద్యానికి బానిసై వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రుద్రూర్ మండలం అంబం(ఆర్)లో పిట్ల శ్రీనివాస్, నందిపేట్ మండల వన్నెల్(కే)లో ఇండ్ల కృష్ణ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి..

బోధన్‌కు చెందిన పిట్ల శ్రీనివాస్(40) అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువుకోసం రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామానికి వచ్చి స్థిరపడ్డాడు. మేస్త్రీగా పని చేస్తూ శ్రీనివాస్ కుటుంబాన్ని పోషించేవాడు. ఆరు నెలల క్రితం ప్రమాదవశాత్తు అతడి కాలు విరగగా, అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. చికిత్స అనంతరం కాలు నయమైనప్పటికీ పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటుండడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం భార్య గంగాలత బ్యాంకు పని నిమిత్తం రుద్రూర్‌కు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాస్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి పదేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. తన భర్త మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.



శ్రీనివాస్ (ఫైల్)

నందిపేట మండలం వన్నెల్(కే) గ్రామంలో నివాసం ఉంటున్న నెల్లూరు జిల్లా జొన్నాడ గ్రామానికి చెందిన ఇండ్ల కృష్ణ (32) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇండ్ల కృష్ణ గత రెండు సంవత్సరాల క్రితం నెల్లూరు నుంచి వన్నెల్ (కే) గ్రామానికి వచ్చి గౌసుద్దీన్ అనే వ్యక్తికి చెందిన ఇటుక బట్టీలో కుటుంబ సభ్యులతో కలిసి పనిచేసుకుంటూ ఇక్కడే ఉండేవాడు. గత కొన్ని రోజులుగా ఇండ్ల కృష్ణ తాగుడికి బానిసై పనికి సరిగా వెళ్లడంలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇటుక బట్టీ ఆవరణలో ఉన్న వేపచెట్టుకు ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న ఇండ్ల మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కృష్ణ మృతదేహం

బంగారం, వెండి చోరీ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని తొండాకూర్ గ్రామానికి చెందిన నామ్‌తాబాద్ భాను అనే మహిళ ఇంట్లో దుండగులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడి బంగారం, వెండితోపాటు నగదు ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భానుతోపాటు ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం ఇంటికి తాళం వేసి జీజీ నడ్కుడలో నిర్వహిస్తున్న అగ్గి మల్లన్న జాతరకు వెళ్లారు. రాత్రి అక్కడే జాగారం చేసి సోమవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడడంతోపాటు బీరువా తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. బీరువాలో ఉన్న సుమారు మూడు తులాల బంగారం, 25తులాల వెండి, రూ.30వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీమును రప్పించి ఆధారాలు సేకరించారు.